

సర్వమతాల సమ్మేళనమే దేశం గొప్పతనం - 8లో

సర్వమతాల సమ్మేళనమే దేశ గొప్పతనమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

- 8లో



వైభవంగా తొలి ఏకాదశి

ఉత్తరాంధ్రలో అతి పెద్ద పుణ్య క్షేత్రం రామతీర్థం లోని సీతారామస్వామి దేవస్థానంలో ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి పూజలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి.

- 8లో



కేజీబీవీల్లో పోస్టులకు స్కిల్ టెస్ట్‌లు

జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రెండవరోజు గురువారం కుమరాం కేజీబీవీలో స్కిల్ టెస్ట్ నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయంతోనే సురక్షితమైన, నాణ్యమైన దిగుబడులు సాధ్యమని వక్తలు అన్నారు. మండలంలోని భోజరాజపురంలో రైతులు గురువారం సామూహిక విత్తన శుద్ధి చేశారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వాండ్రాసి లక్ష్మి, జి. వరప్రసాద్, కె. శంకరరావు, పి. వెంకటరమణ, జి.మోహన్, తదితరులు రైతులకు వివరించారు.

స్వర్ణాలంకరణలో జగన్నాథుడు



స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్య సాయి శివం మందిరంలో ఏర్పాటు చేసిన జగన్నాథస్వామి స్వర్ణాలంకరణలతో భక్తులకు గురువారం దర్శనమిచ్చాడు. తొమ్మిది రోజులుగా జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను అత్యంత వైభవంగా చేపట్టారు. స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చిన స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చందన అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



చందన అలంకరణలో స్వామివారు

జామి: మండలంలో కుమరాం ఐశ్వర్య లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆషాడమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వాతీ నక్షత్రం, తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ సీతారామచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సంపూర్ణ సుగంధ చందన ద్రవ్యాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జూలై 3 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. ప్రతి రోజు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయన్నారు. చివరి రోజు ఉదయం 8గంటలకు సుదర్శన హోమం, అనంతరం ఆలయంలో 11 సార్లు గిరి ప్రదక్షిణ ఉంటుంది.

నమ్మించి.. నగదు కాజేసి..

- వృద్ధుడిని మోసగించిన మహిళ!
- రూ.లక్షన్నర కాజేత
- పోలీసులకు ఫిర్యాదు



వృద్ధుడిని తీసుకెళ్తున్న మహిళ (సీసీ పుటేజీలో)

బొబ్బిలి: బ్యాంకుకు వెళ్లిన ఓ వృద్ధుడికి సహాయం చేస్తున్నట్టు నమ్మించి డబ్బు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొబ్బిలి పట్టణం అగ్రహారం వీధికి చెందిన విశ్రాంత ఉద్యోగి కె.వి.రమణమూర్తి నగదు విత్‌డ్రాచేసేందుకు స్థానిక ఆంధ్రాబ్యాంకుకు బుధవారం వెళ్లాడు. అక్కడ ఓ మహిళ ఆయనకు సహాయం చేస్తున్నట్టు నమ్మించింది. విత్‌డ్రా కౌంటర్ వద్దకు తీసుకెళ్లింది. డబ్బులు విత్‌డ్రాచేశాక రిక్షాపై ఆయనను ఇంటివరకు చేర్చింది. ఇంటికి చేరగానే వృద్ధుడిని లోపలకు తోసివేసి గడియపెట్టి బ్యాగుతో పరారైంది. బ్యాగులో రూ.లక్షన్నర నగదుతో పాటు బ్యాంకుపాస్‌పుస్తకం, మొబైల్ ఉన్నాయి. చోరీ ఘటనపై బొబ్బిలి పోలీసులకు వృద్ధుడు గురువారం ఫిర్యాదు చేశారు. బ్యాంకు సీసీ పుటేజీలు పరిశీలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

దిగుబడులు వెద జల్లుదాం



- జోరుగా వరి వెదలు జల్లుతున్న రైతులు
- సాధారణ పంట కాలం కంటే 10 రోజులు తక్కువ
- పెట్టుబడులు తక్కువ.. దిగుబడులు ఎక్కువ
- జిల్లాలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం 73వేల హెక్టార్లు
- 15 మండలాల్లో ఏటా 17వేల హెక్టర్లలో వెదపద్ధతిలో సాగు
- జిల్లాకు కేటాయించిన వరి విత్తనాలు 27,039 క్వింటాళ్లు
- ఇప్పటికే 42,523 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ

పాలకొండ రూరల్:

నైరుతి రుతుపవనాల ఆగమనంతో పార్వతీపురం మన్యం జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ పంటల సాగులో నిమగ్నమయ్యారు. అదును మేరకు వరి వెదలను ముమ్మరంగా జల్లుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తుండడంతో వెదసాగుకు రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. వర్షాధార, సాగునీటి ఆదరువు ఉన్న భూముల్లో విత్తనాలు జల్లుతున్నారు.

సమృద్ధిగా విత్తనాలు

రైతు పక్షపాతిగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో 306 ఆర్‌బీకేల ద్వారా జిల్లా రైతుల ఆసక్తి మేరకు 27,039 క్వింటాళ్ల వరి వంగడాలు, 42,523 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతు ముంగిటకు సీజన్‌కంటే ముందుగానే చేర్చింది. జిల్లాలోని 1,42,930 మంది అర్హతగల రైతులకు పెట్టుబడి సాయం (రైతుభరోసా) నిధులు రూ. 107.19 కోట్లను అన్నదాత ఖాతాలకు ఇటీవలే జమ చేయడంతో రెట్టించిన ఉత్సాహంతో కర్షకులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

వాతావరణం అనుకూలించడంతో...



పంట భూముల్లో వరి వంగడాలను వెద జల్లుతున్న రైతులు

ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో నేరుగా పొలంలో (వెదపద్ధతి) వరి విత్తనాలు జల్లుతున్నారు. గత ఏడాది 16వేల హెక్టార్లలో వెదలు వేసిన రైతులు ఈ ఏడాది దాదాపు 17వేల హెక్టార్లలో ఈ విధానం అవలంభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియతో ఎకరాకు దాదాపు 12 నుంచి 15 కిలోల విత్తనాలు ఆదా చేయవచ్చు. పెట్టుబడులు తగ్గుతాయి. సాగునీటి ఇబ్బందులు అధిగమించడం, పంట కాలం సుమారు పది రోజులు ముందుగానే దిగుబడి చేతికి వస్తుంది. కూలీల కొరత అధిగమించడం, నారు సకాలంలో అందక ఉడుపులు చేయలేకపోవడం వంటి ఇక్కట్లను సమర్థవతంగా ఎదుర్కొనేందుకు వెదలు జల్లడం ఉత్తమమని రైతులు, అధికారులు చెబుతున్నారు.

వెదలో మెలకువలు..

విత్తనాలుజల్లే ముందు భూమి సమాంతరంగా ఉండేలా దుక్కిచేయాలి. సాంద్రతే ప్రధానంగా ఉండేలా విత్తనాలు వేసుకోవాలి. మొదటి ఆకు విచ్చుకుని, పచ్చబడే వరకూ పొలంలో బురదపదును ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పలుచటి నీటి తడులు అందించాలి. 35 రోజుల తరువాత నీటి తడులు అందేలా చూడాలి. సాధారణ పద్ధతిలో కలుపు నివారణా చర్యలు తీసుకోవాలి. ఈ విధానంలో నారు పెంచడం, ఆకుతీత, ఉడుపులు ఉండవు. ఎకరాకు సుమారు రూ.5వేల వరకు మదుపు తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చు. ఈ పద్ధతివల్ల పొలంలో మొక్కకు సూర్యరశ్మి, గాలి ధారాలంగా సమకూరుతుంది. చీడపీడల బెడద తగ్గి సస్యరక్షణ ఖర్చు తగ్గుతుంది. కిలో విత్తనాలకు ఒక గ్రాము బావిస్టిన్ పొడి లేక 3 గ్రాముల సూడోమోనస్ లీటరు నీటిలో కలపి 24 గంటలు విత్తనాలు నానబెట్టాలి. తర్వాత మరో 24 గంటలు వాటిని గోనె సంచిలో వేసి మండికట్టి వెదజల్లడం శ్రేయస్కరం. బంక నేలల్లో దమ్ము చేసిన మరుసటి రోజు వెద జల్లాలి. లేకుంటే డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయవచ్చు. ఇసుక శాతం అధికంగా ఉండే నేలల్లో వెదలు వేసిన రోజు దమ్ము చేయాలి. తేలికపాటి నీటి తడులు ఉండేలా చూడాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా సీజన్‌లో నత్రజని, భాస్వరం, పొటాస్ వంటి ఎరువులను అధికారుల సూచన మేరకు వాడాలి.

కలుపు యాజమాన్యం...

వెదజల్లిన మూడురోజులు తరువాత కలుపు నివారణ నిమిత్తం పిండిమిథాలిన్ వేయాలి. సాతీ, నామిని గోల్డ్, టాప్ స్టార్ తదితర పోస్టు ఎమర్జెన్స్ హెర్బిసైడ్స్ అధికారుల సూచనల మేరకు సకాలంలో వాడాలి. పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 50 గ్రాములను 20 కిలోల పొడి ఇసుకలో కలిపి ఎకరా మొత్తం సమానంగా జల్లాలి. 20 రోజుల తరువాత కలుపు నివారణకు బిస్పైరీ బాక్ సోడియం 80 మిల్లీలు, ఆల్ మిక్స్ 50 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలి.



వెద జల్లేందుకు భూముల్లో ట్రాక్టర్‌తో సమాంతర దుక్కి

కలుపు మందులు వేసే సమయంలో పొలంలో నీరు తీసిన తరువాత మొక్కలపై పడేలా పిచికారీ చేయడం సరైన పద్ధతి.

పెట్టుబడులు తక్కువ



వెదలు జల్లే విధానంలో రైతులకు పెట్టుబడులు తగ్గుతాయి. కూలి ఖర్చులు మిగులుతాయి. ఎకరాకు విత్తనాలు ఎక్కువగా అవసరం ఉండదు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. పాలకొండలో అధిక శాతం రైతులు వెదలు జల్లే పద్ధతినే అనుసరిస్తున్నారు. అధికారులు సలహాలు, సూచనలు పాటించడంతో దిగుబడులు ఆశించిన మేర వస్తున్నాయి.

– సుంకరి ప్రసాద్, రైతు, పాలకొండ

రైతులకు లాభదాయకం



వెదలు వేసే విధానం రైతులకు లాభదాయకం. సాగునీటి ఇబ్బందులు ఉండవు. మదుపులు, పంట కాలం తక్కువ. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. చీడపీడల బెడద తక్కువ. దిగుబడి పెరుగుతుంది. ఈ విధానాన్ని అవలంభించడం శ్రేయస్కరమే. ఇప్పటికే పలుచోట్ల రైతులు వెదలు వేశారు. ఈ విధానంపై రైతులకు గ్రామస్థాయిలో అవసరమైన సలహాలను ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ సహాయకులు అందిస్తున్నారు.

– ఎన్ని వాహిని, వ్యవసాయాధికారిణి, పాలకొండ

మరిడిమాంబకు సమర్పించేందుకు 108 ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



వైభవంగా మరిడిమాంబ పండగ

- 108 ఘటాలతో అమ్మవారి ఊరేగింపు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 108 ఘటాలతో తిరువీధిగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఉత్సవంలో భాగంగా నిర్వహించిన పులివేషధారణలు, తప్పెటగుళ్లు, మహిళలకోలాటం, మహిషాసురమర్దిని తదితర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. 70 ఏళ్ల తర్వాత జరిగిన పండగలో దూరప్రాంతాల్లో నివసించే గ్రామస్తులందరూ పాల్గొన్నారు. విజయనగరం, విశాఖ, అనకాపల్లి తదితర జిల్లాల భక్తులు తరలివచ్చారు.

చోడి రైతుకు మంచి రోజులు

- రాగులకు మద్దతు ధర పెంచిన ప్రభుత్వం
- క్వింటాకు రూ.3,876ల మద్దతు ధర
- జిల్లాలో 1200 హెక్టార్లలో సాగవుతున్న పంట
- అతి తక్కువ నీటితో సాగుకు అవకాశం
- చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

విజయనగరం ఫోర్ట్: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చిరుధాన్యాల వినియోగం, సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. చోడి సాగుకు అధిక ప్రాధాన్యమిస్తోంది. సాగు విస్తీర్ణం పెంచేలా, రైతులు సాగుకు ఆసక్తిచూపేలా క్వింటాకు రూ.3,876 మద్దతు ధర ప్రకటించింది. మరోవైపు కొర్ర, సామ, ఊద పంటల సాగును కూడా ప్రోత్సహిస్తోంది. వర్షాధార భూముల్లో చిరుధాన్యాలు సాగుచేసేలా రైతులను సన్నద్ధం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బలవర్థక ఆహారంగా ప్రతి రోజు ఉదయం రాగిజావను అందజేస్తోంది. మరోవైపు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు చోడిపిండి సరఫరా చేస్తోంది. రాగుల వినియోగం కూడా ఇటీవల పెరగడంతో, మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా సాగువిస్తీర్ణం పెంచడంపై దృష్టిసారించింది. ఆ మేరకు వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో 1200 హెక్టార్లలో చోడి పంట సాగు

జిల్లాలో చోడి పంట ఖరీఫ్, రబీల్లో 1200 హెక్టార్లలో సాగవుతోంది. ఖరీఫ్‌లో 100 హెక్టార్లు, రబీలో 1100 హెక్టార్లమేర రైతులు సాగుచేస్తున్నారు. దీనిని మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వరి పంట మాదిరి చోడి పంటకు సాగునీటి అవసరం ఉండదు. ఆరుతడిగా అందిస్తే చాలు. ఖరీఫ్‌లో వర్షాధారంపైనే పంట చేతికందుతుంది. మరోవైపు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయకుండా నే పంట చేతికొస్తుంది. పూర్తిగా సేంద్రియ ఎరువుల తో సాగుచేసే పంట కావడం ఆరోగ్యదాయకం.



సాగులో ఉన్న చోడి పంట


తక్కువ పెట్టుబడితో..

చోడి సాగుకు పెట్టుబడి తక్కువ. ఖరీఫ్‌లో వెదపద్ధతి లో ఎకరా విస్తీర్ణంలో చోడిపంట సాగుకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చవుతుంది. రబీలో అయితే నాట్లు వేసేందుకు ఎక్కువ కూలీలు అవసరమవుతారు. పెట్టుబడి మరో 2వేలు అదనంగా ఖర్చవుతుంది. పంటకు చీడపీడల బెడద ఉండదు. పంట కలిసి వస్తే ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల మధ్య దిగుబడి వస్తుంది.

ఆరోగ్యదాయకం..

చోడి (రాగులు) పంటను ఒక్కొక్కరు ఒక్కోవిధానంలో ఆహారంగా వినియోగిస్తారు. కొంతమంది సంకటిగా, మరి కొందరు రాగిజావ (అంబలి)గా ఆహారంగా తీసుకుంటారు. మరికొందరు ఇడ్లీ, బిస్కెట్ రూపంలో తింటారు. చోడిలో ఐరన్ పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

చోడి పంటకు డిమాండ్



రాగులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పంట సాగుకు రైతులు ఆసక్తి చూపేలా ప్రభుత్వం కూడా మద్దతు ధర ప్రకటించింది. చోడి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు అందజేస్తున్నాం. ఎలాంటి నేలలో విత్తనాల విత్తినా పంట కలిసి వస్తుంది. రైతుకు నష్టం లేని పంట ఇది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రతి ఇంటిని సర్వేచేయాలి
- జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం
- విషయ పరిజ్ఞానం లేకపోవడంతో పవన్‌కళ్యాణ్ గాలిమాటలు ఆడుతున్నారు
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులకు సూచించారు. సాలూరు పట్టణం వెలమపేట సీతారామకల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందన్నారు. వివిధ కారణాల వల్ల అర్హులెవరైనా ఉండిపోతే జగనన్న సురక్ష సర్వేలో గుర్తించి లబ్ధికలిగించాలని సూచించారు. దీనికోసం ప్రతి ఇంటిని జల్లెడపట్టాలన్నారు. ఉచితంగా ఆదాయ, కుల, వివాహ, జనన, మరణ తదితర ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.

వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులందరూ సమన్వయంతో ప్రతిఇంటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలని, వారి సమస్యలేమైనా ఉంటే సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అశ్రద్ధవహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

వేగవంతంగా అభివృద్ధి పనులు

మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. బిల్లులు పెండింగ్ లేవన్నారు. 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, గడపగడపకు మనప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయ పరిధిలో ఇస్తున్న రూ.20 లక్షలతో పనులు పూర్తయి అవసరమైతే మరో 20 లక్షలను ముఖ్యమంత్రి మంజూరుచేస్తారని వివరించారు.

వచ్చేనెలలో సీఎం పర్యటన

వచ్చేనెల సాలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందని రాజన్నదొర తెలిపారు. సాలూరు లేదా మెంటాడలలో ఉండొచ్చని, దానిని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సన్నద్ధం కావాలన్నారు.

పవన్‌కళ్యాణ్‌కు విజయపరిజ్ఞానం లేదు..

విషయ పరిజ్ఞానం లేకుండా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గాలిమాటలు ఆడుతున్నారని డిప్యూటీసీఎం రాజన్నదొర విమర్శించారు. పింఛన్ కోసం ఏ ఒక్కరైనా ఎమ్మెల్యేల వద్దకు వస్తున్నారా అని ప్రశ్నించారు.

సచివాలయాల వేదికగా పారదర్శకంగా పథకాలు అందుతున్న విషయం కూడా పవన్‌కళ్యాణ్‌కు తెలియదన్నారు. టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల దోపిడీపై ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఏ ప్రాతిపదికన అందుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ శంకరరావు, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గొర్లె జగన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల పెంపు

- మినీగురుకులాల్లో చదివిన బాలికలకు ప్రవేశాలు
- అధికారులు, పాలకుల చొరవతో సమస్యకు పరిష్కారం

సీతంపేట: విద్యార్థులు డ్రాపౌట్లుగా మారకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. అవసరమైన సీట్లు పెంచుతూ విద్యకు గట్టిపునాది వేస్తోంది. బాలికల కోసం గిరిజన గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో మినీగురుకులాలు నిర్వహిస్తోంది. ఇక్కడ విద్యతో పాటు నాణ్యమైన భోజనం, వసతి, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తారు. ఏడో తరగతి తరువాత చదువు దామంటే విద్యార్థులకు రెసిడెన్షియల్ పేటర్న్‌లో సీటు రావడం కష్టసాధ్యంగా మారింది. ఇప్పటికే అన్ని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో సీట్లు నిండిపోయాయి. ఈ తరుణంలో విద్యాసంవత్సరంలో తమ పిల్లలను ఎక్కడ చదివించాలో తెలియని స్థితిలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. వెంటనే ఆమె ఈ విషయంలో చొరవ చూపారు. గురుకులం సొసైటీ జాయింట్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారికి కూడా సీట్లు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ నెల 26న తాడేపల్లిలో జరిగిన బీవోజీ సమావేశంలో మినీ గురుకులంలో ఏడోతరగతి పాసైన విద్యార్థినులను దగ్గర్లో ఉన్న గురుకుల బాలికల పాఠశాలల్లో చేర్పించాలని గురుకులం సొసైటీ ఉన్నతాధికారులు తీర్మానించారు. దీంతో, సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహించబడుతున్న సీతంపేట, కారిగూడలలో చదువుతున్న విద్యార్థులను స్థానిక బాలికల గురుకుల పాఠశాలల్లో చేర్పించనున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో పాచిపెంట మినీగురుకులం విద్యార్థులను కురుపాం యూఆర్‌జేసీలో ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో పాఠశాలలో 45 మందిని చొప్పున జాయిన్ చేయనున్నారు. ఆ పాఠశాలల్లో అదనపు గ్రూపును ప్రారంభించనున్నారు.



సీతంపేట బాలికల గురుకుల పాఠశాల

క్లుప్తంగా

జూలై 4న మినీ జాబ్‌మేళా


మాట్లాడుతున్న సాయికుమార్

పార్వతీపురంటౌన్: నిరుద్యోగులు ఉద్యోగాలు పొందేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి వి.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్, ముథూట్ ఫైనాన్స్‌లో ఇంటర్న్ పీఓగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. 18నుంచి 27 ఏళ్ల లోపు ఉన్న ఎంసీఏ, బీటెక్, బీఈడీ, బీఎస్సీ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంసీఏ, బీసీఏస్ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు జూలై 4న పార్వతీపురం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న మినీ జాబ్‌మేళాకు హాజరుకాగలరని సూచించారు. ఈ మేళాకు సైట్ స్పెక్ట్రమ్ టెక్నాలజీస్, ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీస్, ముథూట్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని, ఆసక్తి గల యువత డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9182398325,7997299739 నంబర్లను సంప్రదించాలని స్పష్టం చేశారు.

గురజాడ దంపతులకు సత్కారం


గురజాడ దంపతులను సత్కరిస్తున్న సమరసత వేదిక ప్రతినిధులు


విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రా సమరసతా వేదిక ప్రతినిధులు విజయనగరంలోని గురజాడ స్వగృహంలో ఆయన కుటుంబసభ్యులు గురజాడ దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. మహాకవి గురజాడ వాడిన వస్తువులను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం వాటిని సంరక్షిస్తున్న గురజాడ వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర దంపతులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ బొంతుకోటయ్య, కుసుమంచి సుబ్బారావు, హరికేష్, నరసింగనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వేపాడ: దేవరాపల్లి -ఆనందపురం రహదారిలో వేపాడ మండలంలోని సంజీవమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామ శివారు రావాడపాలెం గ్రామానికి చెందిన రావాడ లక్ష్మణరావు (22) వేపాడ మండలం సంజీవ మెట్టలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా దేవరాపల్లినుంచి ఆనందపురం వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు తల, కాళ్లుచేతులకు బలమైన గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు 108లో దేవరాపల్లి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి సూరిబాబు ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహా ఏమి రుచి..!


రామభద్రపురం మార్కెట్‌లో పైనాపిల్ విక్రయిస్తున్న చిరువ్యాపారి

చూడగానే నోరూరించే పండు..పైనాపిల్. అంతరరాష్ట్ర కూడలి రామభద్రపురంలో ప్రతిరోజూ పైనాపిల్ పళ్లతో మార్కెట్ కళ కళలాడుతుంది.ఈ ప్రాంతానికి చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. చూసిన ప్రతి ఒక్కరికీ కొనుగోలు చేయాలనిపించేలా చిరువ్యాపారులు వాటిని పేర్చుతున్నారు. ఒక్కో పండు రూ.10 పలుకుతోంది. ఈ పండులో ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. తక్కువ క్యాలరీలు, ఫైబర్ అధికంగా ఉండి జీవక్రియను పెంచుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైనాపిల్ పళ్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

- రామభద్రపురం

సర్వమతాల సమ్మేళనమే దేశం గొప్పతనం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు
- బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ముస్లిం యువత


బక్రీద్‌ను పురస్కరించుకుని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావును సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు, యువత


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం: సర్వమతాల సమ్మేళనమే భారతదేశ గొప్పతనమని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని విజయనగరం మైనారిటీస్ యువత జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఆయనను సత్కరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మైనార్టీ వర్గాల వారు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీస్ నాయకులు జాకీర్ హుస్సేన్, యువత ఖాద్రి, ఇమ్రాన్, ఆబీద్, ఆసిఫ్, సైఫ్ బాబా, ఇంతియాజ్, సమ్మాని, ఇర్ఫాన్, షాదాబ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

విజయనగరం టౌన్: ముస్లిం సోదరుల పవిత్రదినం బక్రీద్ పండగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు దైవగ్రంథాన్ని మతపెద్దలు చదివి వినిపించారు. పట్టణంలోని జామియా మసీదు, చోటీ, హుస్సేనీ తదితర మసీద్‌లతో పాటు ఈద్‌గాల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని నమాజ్ సందర్భంగా ఆకాంక్షించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రెండోరోజు కొనసాగిన చెస్ పోటీలు

- నేడు విజేతలకు బహుమతి ప్రదానం


రాష్ట్ర స్థాయి చెస్‌పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన అండర్-7 బాల, బాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు రెండోరోజు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 85 మంది క్రీడాకారులు హాజరుకాగా 7 రౌండ్‌లలో వారికి పోటీలు నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సాయంత్రానికి 5 రౌండ్‌లు ముగిశాయి. శుక్రవారం మిగిలిన రౌండ్‌లు పూర్తి చేసిన అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీఏ రావు, కేవీ జ్వాలాముఖిలు తెలిపారు. పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు తదితరులు పర్యవేక్షించారు.

కేజీబీవీల్లో పోస్టులకు స్కిల్ టెస్ట్‌లు


అభ్యర్థులకు స్కిల్‌టెస్ట్ నిర్వహణలో పాల్గొన్న డీఈఓ లింగేశ్వర రెడ్డి తదితర అధికారులు

జామి: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రెండవరోజు గురువారం జామి మండలం కుమరాం కేజీబీవీలో స్కిల్ టెస్ట్ నిర్వహించారు. డీఈఓ లింగేశ్వరరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, డైట్ లెక్చరర్స్ అభ్యర్థులకు స్కిల్ టెస్ట్ జరిగింది. ఈ మేరకు పీజీటీలు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారిలో 99శాతం మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీఓ మాలతి, కుమరాం కేజీబీవీ ప్రత్యేకాధికారిణి బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు

- జూలై 1న బాధ్యతల స్వీకరణ


ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయం చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన టెక్కలిలోని సెంచూరియన్ వర్సిటీ వీసీగా పనిచేస్తున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదనల మేరకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆయనను చాన్స్‌లర్‌గా నియమించింది. జూలై 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, వీసీగా పనిచేశారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ వీసీగా, టైమ్స్ ఆఫ్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేశారు. ప్రస్తుతం స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. జీఎస్‌ఎన్ రాజు ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి టాపర్‌గా నిలిచారు. ఇప్పటివరకు 55 మంది విద్యార్థులకు పీహెచ్‌డీకి దిశానిర్దేశం చేశారు. 535 పరిశోధన పత్రాలు ప్రచురించడంతో పాటు ఈసీఈలో 5 పాఠ్యపుస్తకాలు రాశారు. విద్యారంగానికి ఆయన చేస్తున్న కృషి కారణంగా రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి గౌరవ కల్నల్ బిరుదు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కోల్‌కత్తా గవర్నర్లు, ముఖ్యమంత్రుల చేతుల మీదుగా మాత్రమే కాకుండా పలు అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు. 50కి పైగా అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యారు. ఆయన కృషిని గుర్తించిన సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్‌గా నియమించడంతో విద్యావేత్తలు, అధ్యాపకులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై బాధ్యత మరింత పెరిగిందని విద్యారంగం అభివృద్ధికి, సమాజానికి బాధ్యత గల పౌరులను అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు.

రామతీర్థంలో వైభవంగా తొలి ఏకాదశి


యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు


వెండి మంటపం వద్ద సీతారామస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్రలో అతి పెద్ద పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. అర్చకులు ముందుగా స్వామి వారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుదర్శన కవచం, సుదర్శన అష్టకం, హవనం జరిపించారు. అనంతరం ఆస్థాన వెండి మంటపం వద్ద ఆర్జిత సేవలో భాగంగా సీతారామచంద్రస్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

చాతుర్మాస దీక్ష(యోగ నిద్ర)లో రాములోరు

ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రాత్రి 7గంటల సమయంలో స్వామి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వక్సేనారాధన చేసి స్వామి వారి శయనమూర్తికి ప్రత్యేక పల్లకిలో పవళింపు సేవ చేశారు. ప్రధాన అర్చకుడు సాయిరామాచార్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలుకుని కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు రామచంద్రప్రభువు చాతుర్మాస దీక్ష(యోగ నిద్ర)లో ఉంటారని చెప్పారు. ప్రతి రోజూ స్వామి సన్నిధిలో పవళింపు సేవ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం


బొండపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని బొండపల్లి గ్రామం సమీపంలో గల రైల్వే ట్రాక్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. విజయనగరం రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వచ్చి పరిశీలించామని చెప్పారు. మృతుని శరీరంపై ఎర్రని రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కాతో పాటు, నలుపు రంగు ఫ్యాంటు ధరించి 40 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చని గుర్తించామని రైల్వే ట్రాక్ పక్కన రైలు నుంచి జారి పడి గాయాలపాలై మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అంతకు మించి మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666555214,9490617089 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగు పడి మహిళ మృతి


చీపురుపల్లి రూరల్: సీతమ్మ మృతదేహం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో పిడుగుపడి పతివాడ సీతమ్మ (50) మరణించింది. సీతమ్మ గురువారం మధ్యాహ్నం తనకున్న ఆవులను తీసుకుని మేపేందుకు పొలాల వైపు వెళ్లింది. ఆ సమయంలో వర్షంతోపాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సర్పంచ్ బూడి శ్రీరాములు నాయుడు, వీఆర్‌ఓ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు నమోదు సుకున్నారు.


కొమరాడ: జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశు వైద్య అధికారి చక్రధర్, అటవీశాఖ రేంజర్ త్రినాథ రావు

ప్రమాదశాత్తు జింక..

కొమరాడ: మండల కేంద్రం కొమరాడ సమీపంలో ఉన్న అల్ఫా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన భూమిలో ప్రమాదశాత్తు ఆడజింక మృతి చెందినట్లు పార్వతీపురం అటవీశాఖ రేంజర్ పి.త్రినాథవు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కొమరాడ సమీపంలో ఉన్నా పొలాల్లో నీరు కోసం మచ్చల ఆడ జింక వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మృతి చెందిన జింక చూలుతో ఉండడంతో కడుపులో ఆడపిల్ల ఉందన్నారు. పార్వతీపురం నుంచి పశువైద్యాధికారి డాక్టర్ చక్రధర్ వచ్చి పోస్టుమార్టం చేశారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికను బట్టి వెల్లడిస్తామని చెప్పారు.

చోరీల నిందితుడి అరెస్టు

- బైక్, ఐదుసెల్‌ఫోన్లు, రూ.2వేలు స్వాధీనం


నిందితుడిని మీడియా ముందు హాజరుపరిచి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ: చెడువ్యసనాలకు బానిసైన యువకుడు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గతంలో శిక్షలు అనుభవించినప్పటికీ మార్పురాకపోగా మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రేగిడి మండలం లచ్చన్నవలస, సంతకవిటి మండలం పొనుగుటివలస పంచాయతీ మారుతీనగర్‌లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు నిఘా వేసిన పోలీసులు నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలం లచ్చన్నవలస గ్రామానికి చెందిన కామోజుల వెంకటరమణ తన ఇంట్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఐదు సెల్‌ఫోన్లతో పాటు, రూ.2వేలు నగదు అపహరించాడని ఈ నెల 28న రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే అదే రోజు సంతకవిటి మండలం పొనుగుటివలస పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన బూరాడ చంద్రశేఖర్ తన ద్విచక్రవాహనాన్ని దొంగిలించారని సంతకవిటిలో ఫిర్యాదు చేశాడు. ఈ రెండు ఘటనలు ఒకేరోజు జరగడంతో పోలీసులు నిఘా పెంచి అనుమానితులను ఆరా తీశారు. ఈ క్రమంలో పాలకొండ పట్టణ పరిధి కస్పావీధికి చెందిన తేగల నానిబాబు గతంలో ఇటువంటి దొంగతనాల్లోనే శిక్ష అనుభవించినట్లు తెలుసుకుని ఆరా తీయగా ఆ రెండు దొంగతనాలను తానే చేశానని అంగీకరించాడు, దీంతో అరెస్టు చేసి ఐదు సెల్‌ఫోన్లు, రూ.2వేలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ హెచ్ ఉపేంద్ర తెలిపారు. కార్యక్రమంలో రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు కృషి

- గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మజ


మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ పద్మజ

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు శుక్రవారం నెల్లిమర్లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా గురుకుల విద్యాలయాల కో ఆర్డినేటర్ టి.పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలం జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 13 జూనియర్ కాలేజీలున్నాయని వాటిలో నెల్లిమర్ల, వియ్యంపేట, పాలకొండ, భామినిలో ఆర్ట్స్ కోర్సులు, అన్ని కాలేజీల్లో సైన్స్ కోర్సులున్నాయని తెలియజేశారు. ప్రస్తుతం సిబ్బంది ప్రవేశాల పనుల్లో ఉన్నారన్నారు. వివిధ గురుకులాల్లో 6 నుంచి 9 వ తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్లకు శుక్రవారం ప్రవేశ పరీక్షను ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 94 శాతం, ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో 75 శాతం, సెకెండియర్‌లో 77.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని అన్నారు. రానున్న పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అందరి సహకారంతో శతశాతం ఉత్తీర్ణ సాధనకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జోగింపేట గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

- పడిపోయిన పోల్స్, వైర్లు మార్పు
- ఫిర్యాదు వచ్చిన వెంటనే సమస్య పరిష్కారం


గంట్యాడ మండలంలో విద్యుత్ స్తంభాన్ని ఎత్తుతున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ ప్రమాదాలను నివారించే దిశగా అ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్ స్తంభం పడిపోవడం వల్ల, వైర్లు మీద పడి మనుషులు మరణించారనే అపవాదు రాకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు, సహకారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తోంది. దీంతో ఏళ్ల తరబడి నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. సమస్యలకు తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై విద్యుత్‌శాఖ సిబ్బంది సర్వేచేసి గుర్తించి పరిష్కరిస్తున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు



విద్యుత్ ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నాం. సమస్యలు ఉన్నాయని ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కారిస్తున్నాం. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 కు వినియోగదారులు ఫోన్‌చేసి తెలియజేయాలి.

ముప్పల లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

జిల్లా వ్యాప్తంగా సర్వే

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, జేఈలు, ఏడీఏలు వారి పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థపై సర్వే చేశారు.

3790పోల్స్ మార్పు:

గడిచిన ఏడాది కాలంలో డ్యామేజ్ పోల్స్ 3790 మార్చి కొత్త పోల్స్ వేశారు. అలాగే 9884 కిలోమీటర్ల వైర్లు మార్చారు. 33కేవీ లైన్‌కు సంబంధించి 64 ఫీడర్లు ఉన్నాయి. ఈ 64 ఫీడర్లలో ఉన్న సమస్యలను పరిష్కరించారు. 16 వేల ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4 కోట్ల వరకు ఖర్చు చేసింది. పట్టణ ప్రాంతాల్లో అయితే ట్రాన్స్‌ఫార్మర్ 12 గంటల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోగా మారుస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960-00
బంగారం(22సి. 10గ్రా.)	54,050-00
వెండి (కిలో)	75,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹ 254